www.prajasakti.com
# ప్రజాశక్తి
సోమవారం 18 సెప్టెంబరు 2023




## గొల్లవానితిప్పలో రౌడీషీటర్ దారుణ హత్య

**భీమవరం రూరల్ :** గొల్లవానితిప్పలో పట్టపగలు నడిరోడ్డుపై ఆదివారం దారుణ హత్య జరిగింది. స్థానిక కనక దుర్గమ్మ ఆలయం సమీపంలో బలుసుమూడుకు చెందిన రౌడీషీటర్ దేవరపు విజయ్ (23)ను కత్తులతో నరికి హత్య చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న విజయ్‌ను వెనుక నుంచి ఢీకొట్టి కత్తులతో అతి కిరాతకంగా పొడిచి హత్య చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయ్ గతంలో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో భీమవరం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకం చేసి వెళ్తుండగా కారులో వచ్చిన దుండగులు దాడి చేసి హత్య చేశారు. బైక్‌పై వెళ్తున్న విజయ్‌ను కారుతో ఢీకొట్టి అనంతరం కత్తులతో నరికి హత్య చేసి కారులో పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌పి రవిప్రకాష్ పరిశీలించారు.

# ఏం కొనేటట్టు.. తినేటట్టు.. లేదు

**వినాయక చవితికి ధరాఘాతం**
**చుక్కల్లో నిత్యావసరాల ధరలు**
**పిండి వంటలకు రూ.వేలల్లో ఖర్చు**
**కానరాని పండుగ సందడి**




**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

**ధరల పెరుగుదల సామాన్య ప్రజానీకాన్ని పండుగలకు సైతం దూరంచేస్తోంది. పండుగ రోజున కూడా పిండివంటలు చేయాలన్నా, సందడిగా పండుగ చేసుకోవాలన్నా భయపడాల్సి వస్తోంది. మోదీసర్కార్ వచ్చాక వంటనూనె, కందిపప్పు, మినపప్పు ఇలా అన్ని నిత్యావసర ధరలతోపాటు, వంటగ్యాస్ ధర సైతం పెరిగిపోవడం, పన్నుల భారాలు మోపడంతో సామాన్య ప్రజానీకం పండుగలకు సైతం పిండివంటలు చేసుకోలేని దుస్థితి నెలకొంది. దీంతో ఒకప్పుడు ఎంతో ఆర్భాటంగా జరిగే వినాయకచవితి పండుగ సైతం జిల్లాలో సందడిలేకుండా పోయింది. ధరల పెరుగుదలతో సామాన్యుల ఇళ్లల్లో పండుగ సందడి లేక వెలవెలబోతున్నాయి.**

మోదీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సామాన్యుల జీవనం భారంగా మారింది. రోజు గడవడమే కష్టంగా తయారైంది. కరోనా తర్వాత ఉపాధి దెబ్బతిని ఆర్థిక ఇబ్బందులు ఒకవైపు, రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలు మరోవైపు జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గతంలో వినాయక చవితిని ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లాలో ఘనంగా నిర్వహించేవారు. సామాన్య ప్రజానీకం సైతం వివాహమైన కుమార్తెలను, అల్లుళ్లను, దగ్గర బంధువులను ఇంటికి పిలిచి ఎంతో సందడిగా పండుగను నిర్వహించుకునేవారు. పండుగ రోజు నాలుగైదు రకాల పిండివంటలు చేసుకుని, ఉండ్రాళ్లు వండి పూజలు చేసుకుని సంతోషంగా గడిపేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితిగానీ, వినాయక చవితి సందడిగానీ జిల్లాలోపెద్దగా కనిపించడం లేదు. అందుకు ప్రధానకారణం పెరిగిన ధరలే. ప్రజలపై మోపుతున్న వివిధ రకాల భారాలే. ప్రస్తుత మార్కెట్లో నిత్యావసర ధరలు మండిపోతున్నాయి. వంటనూనె కిలో ప్యాకెట్ రూ.120 నుంచి రూ.160 వరకూ ఉంది. మినపప్పు కిలో రూ.125 పలుకుతుండగా, పెసరపప్పు కిలో రూ.131, వేరుశనగ గుళ్లు కిలో రూ.160, బెల్లం కిలో రూ.60 వరకూ ఉన్నాయి. వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.980 ఉంది. కట్టెల పొయ్యిపైన వంటచేసే పరిస్థితి ఎక్కడా లేకుండా పోయింది. ఏది చేయాలన్న వంటగ్యాస్‌తోనే చేయాలి. రెండు, మూడు రకాల పిండివంటలు చేయాలంటే వంటగ్యాస్ పెద్దఎత్తున ఖర్చవుతుంది. నెలంతా రావాల్సిన గ్యాస్ సిలిండర్ పిండివంటలకు ఉపయోగిస్తే వారంరోజుల్లోనే అయిపోయే పరిస్థితి ఉంటుంది. వినాయక చవితిరోజు పులిహోర, పొంగలి, గారెలు, బూరెలు వంటి పిండివంటలు చేయాలంటే వంటనూనె నుంచి అన్ని సరులకులు అవసరం. వీటి ధరలు భారీగా పెరిగాయి. ఏదైనా ఒక పిండివంట చేయాలన్న రూ.రెండు వేలు వరకూ ఖర్చవుతుంది. రెండు, మూడురకాలు చేయాలంటే పెద్దఎత్తున ఖర్చుపెట్టాల్సి ఉంది. రోజంతా కష్టపడి పనిచేస్తే రూ.400 నుంచి రూ.500 కూలి రావడమే గగనంగా మారింది. నెలలో సగం రోజులు పనిదొరికితే గొప్పఅన్నట్లు పరిస్థితి ఉంది. కరెంటు బిల్లులు, పెట్రోల్ ధరలు, చెత్తపన్ను, నీటిపన్ను, జిఎస్‌టి ఇలా అనేక రకాల భారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపాయి. వీటికి తోడు నిత్యావసర ధరలు అందనంత ఎత్తుకు చేరాయి. దీంతో సామాన్య కుటుంబాల జీవనం భారంగా మారింది. దీంతో పండుగ చేసుకోవాలంటే భయపడుతున్నారు. ఇవేకాకుండా వినాయ ప్రతిమ, పూజకు ఉపయోగించే పత్రిసైతం సొమ్ములు చెల్లించి కొనుగోలు చేయాల్సిన వస్తుంది. ఇవన్నీ సామాన్యులకు పెనుభారంగా మారాయి. దీంతో ఒకప్పుడు ఎంతోఉత్సాహంగా జరిగే వినాయక చవితి వంటి పండుగ సైతం ప్రస్తుతం సందడి లేకుండా పోయింది. వినాయకచవితి మాత్రమే కాదు సంక్రాంతి, దీపావళి, దసరా వంటి పండుగలకు సైతం సామాన్య ప్రజానీకం దూరంగా ఉండాల్సిన దుస్థితి దాపురించింది. ప్రజలంతా ముక్తకంఠంతో ఉద్యమించినప్పుడు మాత్రమే ప్రభుత్వాలు దిగొస్తాయి. లేకపోతే సామాన్యుల బతుకులు రోజురోజుకు మరింత దుర్భరంగా మారే పరిస్థితి ఏర్పడనుంది.

### భారీగా పెరిగిన వినాయక చవితి పూజ సామాగ్రి ధరలు

**ఉండి:** ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా వినాయక చవితి పండుగ పూజకు అవసరమైన సామగ్రి ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా కొండెక్కాయి. దీంతో సామాన్య ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులుపడ్డారు. యాపిల్, బత్తాయి వంటి పండ్లు రూ.వందకు కేవలం మూడు కాయలు మాత్రమే విక్రయించారు. వెలగ, మారేడు, మొక్కజొన్న పొత్తు వంటి ధరలు కూడా భారీగాఉండటంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోయారు. వినాయక ప్రతిమల ధరలు కూడా రెట్టింపు అయ్యాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. ప్రతీ వస్తువు ధర గతంలో కంటే అధికంగా ఉందని పలువురు తెలిపారు.


మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి భీమారావు

## రాజ్యాంగ విరుద్ధంగా వైసిపి పాలన

**ప్రజాశక్తి - భీమవరం**

ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతల పట్ల, ప్రజా ఉద్యమాల పట్ల జగన్ ప్రభుత్వం తీరు దారుణంగా ఉందని, రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి కోణాల భీమారావు విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వీటికి అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన భీమారావు మాట్లాడుతూ రాష్ట్రంలో తాలిబాన్ తరహా పాలన సాగుతోందని నాలుగున్నరేళ్లుగా జగన్ ప్రజాఉద్యమాలను అణచివేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు అక్రమ అరెస్టు ఉదంతం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమేని ఇది దేనికి సంకేతమని ప్రశ్నించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలపట్ల రాష్ట్రంలో నాలు గున్నరేళ్లుగా నిర్బంధాలు సాగుతున్నాయని, ప్రజలకు తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం లేకుండా అరెస్టులు, గృహనిర్బంధాలు చేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు పాతరేస్తున్నారని, చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమని ఖండించారు. జగన్ సర్కారు డ్వాక్రా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఇలా అన్ని ఉద్యమాలను అణచివేస్తున్నారని, వీటిని ఎదుర్కోవాలని, తగిన సమయం వచ్చిందని ప్రజాస్వామ్య వాదులంతా కదలిరావాలని బలరాం విజ్ఞప్తి చేశారు.

టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడుతూ ప్రజావేదిక కూల్చివేతతో జగన్ అరాచక పాలన మొదలైందని, తరువాత మూడు రాజధానులతో ప్రాంతాల మధ్య చిచ్చురేపారని, రివర్స్ టెండరింగ్, పోలవరం నిలిపివేత, ప్రత్యేక హోద, విభజన హామీల అమలు వీటన్నింటినీ తాకట్టు పెట్టేశారని విమర్శించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసు పెడితే ముందుగా ప్రేమచంద్రారెడ్డి, అజయ్ కల్లాం, పివి.రమేష్‌పై పెట్టాలని డిమాండ్ చేశారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యంలేదని, జిఒ నెం-1, సెక్షన్ 30, 144లే రాజ్యమేలుతున్నాయని, గూండాల పాలన సాగుతోందని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారామ్‌ప్రసాద్, సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, కాంగ్రెస్ నాయకులు తమలంపూడి వంశీ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మైలాబత్తుల ఐజాక్‌బాబు, ఫార్వర్డ్ బ్లాక్ పట్టణ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు, సిపిఐ నాయకులు నాగిడి శాంతమూర్తి, మల్లుల శ్రీనివాసరావు, వైవి.ఆనంద్, అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కష్టమర్స్ అసోసియేషన్ నాయకులు కె.గోపాలకృష్ణమూర్తి, వై.వీరకృష్ణ, వి.నరసింహాచారి, పైడిరాజు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

## దళిత రక్షణయాత్రను జయప్రదానికి పిలుపు

**ప్రజాశక్తి - కాళ్ల**

రాజ్యాంగంలో దళితుల హక్కులను కాలరాస్తున్న మతోన్మాద బిజెపిని విధానాలను ఐక్య ఉద్యమాల తిప్పికొట్టాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా నాయకులు గొర్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ నెల 21వ తేదీన వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న దళిత రక్షణయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ సంతకాల సేకరణను సీసలి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం సెంటర్లో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత సనాతన ధర్మం పేరుతో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసి దళితుల నిధులను, చట్టాలను నీరుగారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మహిళా జిల్లా కన్వీనర్ జక్కంశెట్టి వెంకటలక్ష్మి, కెవిపిఎస్ మండల నాయకులు బాతు రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ దాసి లాజర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు దళితపేటలకు ఖర్చు చేయకుండా ఇతర సంక్షేమానికి మళ్లించడం వల్ల దళిత పేటలో రోడ్లు, డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. మరోపక్క అసైన్డ్ చట్టాన్ని సవరణ చేసి దళితుల చేతుల్లో ఉన్న భూములను స్వాధీనానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రద్దు చేసిన దళితుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.


ఈనెల 21వ తేదీన ప్రచార యాత్ర భీమవరంలో ప్రారంభం అవుతుందని ఆరోజు మధ్యాహ్నం మూడు గంటలకు కాళ్ల మండలం చేరుకుంటుందని తెలిపారు. అనంతరం ఈ నెల 29వ తేదీన భీమవరంలో మహాధర్నా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడలకు టౌన్ హాలు ప్రాధాన్యత అభినందనీయం

### వార్షికోత్సవంలో శాసన మండలి ఛైర్మన్ మోషేన్ రాజు

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

క్రీడలకు భీమవరం ఎల్‌హెచ్ టౌన్ హాలు అధిక ప్రాధాన్యతివ్వడం అభినందనీయమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఎల్‌హెచ్ టౌన్ హాల్ 83వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. టౌన్ హాలు ప్రెసిడెంట్ బండి శక్తీశ్వర సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మోషేన్‌రాజు, గ్రంధి శ్రీనివాస్ మాట్లాడారు. టౌన్‌హాలు సర్వమత సమ్మేళంగా అభివద్ధి చెందడం అభినందనీయమన్నారు. ప్రెసిడెంట్ సాంబమూర్తి మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులందరూ మంచిస్ఫూర్తితో సంఘటితంగా అన్ని కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. టౌన్‌హాల్ టెన్నిస్ ప్లేయర్స్ నేషనల్ లెవెల్ టౌర్నమెంట్స్‌లో మూడు ఈవెంట్స్‌లో గెలుపొందిన షటిల్ ప్లేయర్స్, ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగిన 12 ఈవెంట్స్‌లో గెలుపొందిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. 83వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన టోర్నమెంట్స్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం టెన్నిస్ క్రీడాకారుడు డాక్టర్ ఆర్కే రాజును ఘనంగా సత్కరించారు. డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మాజీ ఎంఎల్‌ఎ పూలవర్తి రామాంజనేయులు, జగదీష్ మెరైన్ అధినేత తోట జగదీష్, టౌన్ హాల్ మాజీ అధ్యక్షులు మెంటే పార్థసారధి, ప్రధాన కార్యదర్శి కామన నాగేశ్వరరావు, కార్యదర్శి గ్రంధి సురేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న పివిఎల్ నరసింహరాజు

## ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

### రూ.1.60 కోట్లతో ఒహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం

### డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

**ప్రజాశక్తి - పాలకోడేరు**

ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని వేండ్ర గ్రామంలో రూ.50 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు, మరో రూ.27 లక్షలతో పైపులైన్ ఏర్పాటు, పెన్నాడ గ్రామంలో రూ.83 లక్షలతో ఓచర్ ట్యాంకు, పైపులైన్ ఏర్పాటుకు సంబంధించి ఆదివారం ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు)తో కలిసి పివిఎల్.నరసింహరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పివిఎల్.నరసింహరాజు మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా రూ.1.60 కోట్లతో తాగునీటి పథకాలను అభివృద్ధి చేయనున్నామన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఎంపిపి చంటిరాజు మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి పివిఎల్ ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. పాలకోడేరు మండలాభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి పివిఎల్ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. రానున్న రోజుల్లో పివిఎల్‌కు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేండ్ర సర్పంచి కడలి నాగేశ్వరి వీరబాబు, పెన్నాడ సర్పంచి చిల్లా అనూష సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు పాల జ్యోతి, ఆదాడ లక్ష్మీతులసి, ఆరేపల్లి పెద్ద వెంకటస్వామి, ఉప సర్పంచులు భూపతిరాజు సుబ్బరాజు, కోరం వెంకటేశ్వర్లు, విస్సాకోడేరు సొసైటీ అధ్యక్షులు జోషి, వైసిపి నాయకులు కటిక శ్రీదేవి, పెన్నాడ గోపాల్‌కృష్ణంరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, చోడదాశి నరేష్, దుండి అశోక్‌బాబు, సానబోయిన వేణు, భూపతిరాజు రాంబాబు, సాయికృష్ణ, సత్యనారాయణ రాజు, కిరణ్, గోపీ, కె.కృష్ణ, శ్రీను, రమణ, రాజబాబు పాల్గొన్నారు.


ఆచంటలో టిడిపి నేతల దీక్ష

## కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

**ప్రజాశక్తి - ఆచంట**

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆచంటలో మాజీమంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు పితాని వెంకట్ రిలే దీక్షలు ఐదో రోజు ఆదివారం కొనసాగాయి. ఈ దీక్షలకు జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పితాని వెంకట్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పర్యరక్షించాల్సిన ప్రభుత్వమే ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని అన్నారు. ప్రజల్లో టిడిపికి వస్తున్న ఆదరణ చూసి జగన్‌కు భయం పట్టుకుందని, ఈ నేపథ్యంలో జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఒక గొప్ప నాయకుడిని అక్రమంగా అరెస్టు చేయడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే కాకుండా యావత్ భారతదేశం ముక్తకంఠంతో ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు గొడవర్తి శ్రీరాములు, బలుసు శ్రీరామ్మూర్తి, సర్పంచులు నేలపూడి బేబీ, రామ్మోహన్‌రావు, అల్లం పద్మావతి, సూర్యప్రకాశరావు, ప్రభాకర్, కేతా మురళీ, బాలాజీ, చిలుకూరి సీతారాం, బీరా నరసింహమూర్తి, సత్యనారాయణ, చిలుకూరి శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నరసింహమూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

**ఉండి :** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు ఆధ్వర్యంలో ఐదో రోజు రిలే నిరసన దీక్ష కొనసాగింది. ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు నిరసన దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ కుట్ర రాజకీయాలను ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రకు విశేష స్పందన రావడంతో దానిని అడ్డుకునేందుకు చంద్రబాబును రాజకీయ దురుద్దేశంతో అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, కిన్నెర వెంకన్న, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, కట్టా రాంబాబు, కాగిత బుజ్జి, కరిమెరక శ్రీనివాస్, వనిమా శ్రీనివాస్, గవర అనిల్, పాలపర్తి బాలాజీ, ముదునూరి హరికృష్ణం రాజు, దుర్గరాజు పాల్గొన్నారు.

**నరసాపురం టౌన్ :** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు ఆధ్వర్యంలో జోగి రాధాకృష్ణన్(పండు) అధ్యక్షతన పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో ఆరో రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో జక్కంశెట్టి ఏడుకొండలు, సూరారపు బలరామరాజు, చూడూరి ఏడుకొండలు, జక్కంశెట్టి వెంకటేశ్వర్లు, కడలి సత్యనారాయణ, బొక్క శ్రీను, కడలి ముత్యాలరావు గుబ్బల ఏడుకొండలు పాల్గొన్నారు.

**భీమవరం రూరల్ :** చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి భీమవరం నియోజకవర్గ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో ఆదివారం తెలుగుయువత, వాణిజ్య విభాగం, లీగల్ సెల్ టిఎన్‌టియుసి, టిఎన్‌ఎస్‌ఎఫ్, అనుబంధ సంస్థల కమిటీల నాయకులు పాల్గొన్నారు. నిరాహార దీక్ష శిబిరాన్ని రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూర్తులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపల్లి వెంకట్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల నాగబాబు, వాణిజ్య విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లబోయిన గోవింద్, పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు పాల్గొన్నారు.

**పాలకొల్లు :** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి నేతలు చేపట్టిన దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరాయి. ఈ దీక్షలకు ఆదివారం క్లాత్ అండ్ యార్న్ మర్చంట్స్ అసోసియేషన్ సంఘీభావం తెలిపాయి.

## పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

**ప్రజాశక్తి - మొగల్తూరు**


మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకలతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు సుదూర ప్రాంతాల నుంచి బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో అధిక సంఖ్యలో పర్యాటకులు బీచ్‌కి తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకువస్తున్న కెరటాలతో ఇసుక తెన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.


బీచ్‌లో పర్యాటకుల సందడి

## క్రీడలతో గూడెంకు జాతీయ స్థాయి గుర్తింపు : డిప్యూటీ సిఎం కొట్టు

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

ప్రతిభావంతులైన క్రీడాకారులతో తాడేపల్లిగూడేనికి జాతీయస్థాయి గుర్తింపు రావడం గర్వకారణమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన పలువురు స్కేటింగ్ క్రీడాకారులు జిల్లా స్థాయిలో మెడల్స్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారంతా ఆదివారం మంత్రి కొట్టును కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి గాను జరిగే జాతీయస్థాయి పోటీలకు సన్నాహకంగా జిల్లాస్థాయిలో ఏలూరు జిల్లా స్కేటింగ్ ఫెడరేషన్ అసోసియేషన్ జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, తణుకు పట్టణాలకు సంబంధించిన పిల్లలు స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో తాడేపల్లిగూడెం పట్టణానికి చెందినవారు సత్తాచాటారు. సుమారు 32 మంది స్కేటర్లు 41 ఈవెంట్లలో పాల్గొనగా 45 మెడల్స్ సాధించారు. కొట్టు సత్యనారాయణ ప్రోత్సాహంతో వైసిపి టౌన్ ప్రెసిడెంట్ గుండుబోగుల నాగు సహకారంతో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ప్రాక్టీస్ చేయడానికి అవకాశం కల్పించడంతో తాము ఈ విజయాలు సాధించగలిగామని వారు మంత్రికొట్టుకు, టౌన్ ప్రెసిడెంట్ గుండుబోగుల నాగుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది నవంబర్‌లో స్టేట్ లెవిల్, డిసెంబర్లో నేషనల్ లెవిల్ స్కేటింగ్ పోటీలు జరగనున్నాయి. దీనికోసం అక్టోబర్, నవంబర్ నెలల్లో శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి అనుకూలంగా తమకు ప్రాంగణాన్ని కేటాయించాలని వారు కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ క్రీడల్లో తాడేపల్లిగూడేనికి జాతీయస్థాయి గుర్తింపు రావడం గర్వకారణమన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్కేటింగ్ క్రీడాకారుల కోసం విశాలమైన ప్రాంగణంలో స్కేటింగ్ పార్క్ ఏర్పాటుకు స్థలం కేటాయింపునకు పరిశీలిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. బాగా శిక్షణ పొంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం స్కేటింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సబ్బిళ్ల ఆశాదేవి, వైస్ ప్రెసిడెంట్ పులవర్తి ముత్యాలరావు, సెక్రటరీ పెద్దిరెడ్డి నరేష్, జాయింట్ సెక్రెటరీ మానేపల్లి సతీష్, ట్రెజరర్ సత్తి రామకృష్ణారెడ్డి, సభ్యులు పచ్చిగోళ్ల కిషోర్, ఎల్.సూర్యనారాయణమూర్తి, పెనుమత్స రేఖ, గరగ సాయిసుందరి, దూసనపూడి మధు, ఎం.నాగచంద్రబాబు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ


## ఇంజినీరింగ్‌లో జయశ్రీ ప్రతిభ

**ప్రజాశక్తి - మొగల్తూరు**



జయశ్రీ

మొగల్తూరుకు చెందిన అనంతపల్లి జయశ్రీ ఇంజినీరింగ్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించింది. జయశ్రీ భీమవరంలోని విష్ణు ఇంజినీరింగ్ మహిళా కళాశాలలో బీటెక్ పూర్తి చేసింది. కళాశాలలో మొదటి స్థానంలో నిలిచింది. ఆదివారం కళాశాల ఆవరణలో స్నాతకోత్సవాలను పురస్కరించుకుని కళాశాల ఛైర్మన్ విష్ణురాజు చేతులమీదగా జయశ్రీకి బంగారు పతకం, ప్రశంసపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆర్యవైశ్య సంఘ సభ్యులు, పలువురు గ్రామ పెద్దలు జయశ్రీని అభినందించారు.



రేణుకను సత్కరిస్తున్న వక్తలు

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు రేణుకకు సత్కారం

**ప్రజాశక్తి - ఆచంట**

ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని హోలీ ఏంజెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కె.రవికుమార్ అన్నారు. కొడమంచిలి హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న రేణుకకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల ఆ స్కూల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రేణుకకు డిఇఒ సివి.రేణుక ప్రశంసాపత్రాన్ని అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జాతి ఔనత్యాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు మండల వ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారంటే అందులో ఉపాధ్యాయులు కృషి ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా రేణుకకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు రావడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచి సుంకర సీతారామ్ ఆమెకు అభినందనలు తెలిపారు.



కిటకిటలాడుతున్న మొగల్తూరు మార్కెట్

## మొగల్తూరు మార్కెట్ కిటకిట

**ప్రజాశక్తి - మొగల్తూరు**

మండల కేంద్రమైన మొగల్తూరులోని మార్కెట్ ఆదివారం కిటకిటలాడింది. సోమవారం వినాయక చవితిని పురస్కరించుకుని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో పూలు, పండ్లు, వినాయక విగ్రహాలు, పత్రి దుకాణాలు వెలిశాయి. వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు రావడంతో మార్కెట్ కళకళలాడింది.

**జోరుగా పత్రి విక్రయాలు**

**పెనుమంట్ర :** వినాయకచవితి సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం వినాయక పత్రి అమ్మకాలు జోరుగా సాగాయి. ముఖ్యంగా పొలమూరు, పెనుమంట్ర, బ్రాహ్మణచెరువు, ఆలమూరు, మార్టేరు, నత్తా రామేశ్వరం, నెగ్గిపూడితో పాటు పలు గ్రామాల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. ముఖ్యంగా వెలక్కాయ డజను రూ.30 నుంచి 40, సీతాఫలం జత రూ.10 నుంచి 20, నారింజ జత రూ.20, ఆపిల్ డజను రూ.200, చిన్న మట్టి విగ్రహాలు రూ.10 నుంచి 50 వరకు అమ్మకాలు జరిగాయని చిరు వ్యాపారులు తెలిపారు.

## ఘనంగా మహంకాళి పుట్టినరోజు వేడుక

**ప్రజాశక్తి - ఉండి**

లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కాగిత మహంకాళి 75వ పుట్టినరోజు వేడుకలు కోట్ల ఫంక్షన్ హాలులో టిడిపి నాయకులు, కార్యకర్తలు, లయన్స్ క్లబ్ సభ్యులు, మిత్రులు అభిమానుల సమక్షంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ కాగిత మహంకాళి టిడిపి ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీకి ఎన్నో సేవలందించారని కొనియాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న అతి కొద్ది మంది సీనియర్ నాయకుల్లో మహంకాళి ప్రథమ స్థానంలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, కట్టా రాంబాబు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, కిన్నెర వెంకన్న, మంతెన సాయిలచ్చిరాజు, తోట ఫణి, కాగిత బుజ్జి, రుద్రరాజు యువరాజు, యశోద కృష్ణయ్య, వనిమా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చేపల మార్కెట్ పరిశీలన

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పట్టణంలోని డైలీ చేపల మార్కెట్‌ను వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మకందారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ అపారిశుధ్యంగా ఉంటుందని అమ్మకందారులు గోపీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గోపీ మాట్లాడుతూ పారిశుధ్య సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఆయనతో పాటు వైసిపి నేతలు చందక సత్తిబాబు, కోరాడ శ్రీను, కొరగంజల శ్రీను, కర్రా జయసరిత, జోగి వెంకటేశ్వరరావు, గవర బుజ్జి, ఖండవల్లి వాసు, మోర్త గిరీష్, పెద్దిరాజు పాల్గొన్నారు.

## యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

**ప్రజాశక్తి - మొగల్తూరు**

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, పలువురు గ్రామస్తులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి

**భీమవరం :** జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి జివిఆర్‌కెఎస్-ఎస్.గణపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వ వేడుకగా నిర్వహించాలని ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. లోకంలోని రకరకాల వృత్తులకు ఆధ్యుడైన విశ్వకర్మ జయంతిని ప్రతి ఏడాది సెప్టెంబర్ 17న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కర్మాగారాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో పనిముట్లను విశ్వకర్మ ముందుంచి పూజిస్తారని, శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి రోజునే భారతీయులు శ్రామిక దినోత్సవం కూడా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ టి.ప్రసాద్, ఎబిసి డబ్ల్యుఒ కలిదిండి వెంకటేశ్వరరావు, హెచ్‌డబ్ల్యుఒలు కడలి శ్రీను, కె.నాగమోహనరావు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.




# క్రీడా మైదానం.. వర్షం వస్తే జలమయం

### ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఉమ్మడి క్రీడాగ్రౌండ్ దుస్థితి

**ప్రజాశక్తి - ఆచంట**

వర్షం కురిస్తే ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం చెరువును తలపిస్తుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉమ్మడి ఆటల మైదానం అధ్వానంగా తయారవ్వడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. క్రీడాస్థలం పల్లంగా ఉండటం, వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికి మైదానం నీటమునగడం పరిపాటిగా మారింది. మైదానంలో సుమారు రెండు అడుగుల లోతు వర్షపు నీరు నిలిచిపోతుంది. వర్షాకాలం వచ్చేసరికి రోజులు తరబడి నీరు నిలిచిపోవడంతో మైదానం మొత్తం బురదమయంగా మారుతుంది. దీంతో సుమారు 1300 మంది విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రీడా మైదానాల్లో నిలిచిన నీరు పూర్తిస్థాయిలో తగ్గడానికి సుమారు 20 రోజుల వరకు పడుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మైదానాన్ని మెరక చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, మానసిక ఉల్లాసానికి ఆటలు అంత ముఖ్యమే. ఆడుకోవడానికి అవకాశం లేకపోవడంతో తరగతి గదులకు పరిమితం అవుతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ సమస్య అలాగే కొనసాగుతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.




వర్షపునీటితో జలమయమైన క్రీడామైదానం

**చినుకు పడితే చిత్తడిగా మైదానం**

పరిసర ప్రాంతాల్లో ఎక్కడా లేనంత ఆటస్థలం ఈ పాఠశాలకు ఉంది. అయితే కొంతమేర నిరూపయంగా ఉన్న మైదానం మధ్యలో ఎంవిఆర్ జూనియర్ కళాశాలకు చెందిన అదనపు తరగతి గదులు అదనపు భవన నిర్మాణంతో విశాలమైన ఆటస్థలం కాస్త కుషించిపోయింది. చినుకు పడితే చాలు మైదానమంతా వర్షపు నీటిలో మునిగిపోతుంది. దీంతో విశాలమైన మైదానం ఉన్న నిరుపయోగంగా మారింది. ఈ నేపథ్యంలో వర్షపు నీరు బయటకు వెళ్లే విధంగా తగిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతుందని విద్యార్థులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆ పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు క్రీడా మైదానం అభివృద్ధి చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# మట్టి విగ్రహాల తయారీలో ఆదుర్తి కుటుంబం



విగ్రహాలకు రంగులు వేస్తున్న అత్తాకోడళ్లు

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

మట్టి విగ్రహాలు తయారు చేయడంలో మండలంలోని జుత్తిగ గ్రామంలో కుమ్మరి కుటుంబానికి చెందిన ఆదుర్తి కుటుంబం ఒకటి. సుమారు ఏడు దశాబ్దాల కాలంగా చిన్న విగ్రహాల సైజు నుంచి మూడు అడుగుల విగ్రహం వరకు తయారు చేయడంలో సోదరులు ఆదుర్తి పెద గరటయ్య, చిన్న గరటయ్య, చిన్న సాయిరామకృష్ణ మంచి ప్రావీణ్యం సంపాదించారు. వీరిలో ప్రముఖుడు చిన్నగరటయ్య సంతానంలో రెండో వ్యక్తి. వినాయక చవితి సీజన్‌లో సుమారు వెయ్యికి పైగా విగ్రహాలు తయారు చేసి చుటు ప్రక్కల పది గ్రామాల వరకు హోల్‌సేల్ , రిటైల్ ధరలకు అమ్మకాలు చేస్తూ ఉంటారు. చిన్న విగ్రహం రూ.14 నుంచి రూ.30 వరకు విక్రయిస్తుంటారు. అదే మూడు అడుగుల విగ్రహం అయితే రూ.500 వరకు విక్రయిస్తామని చిన్న గరటయ్య తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట నుంచి బూడిద, నావసుద్ధ, చాక్ పౌడర్, రంగులు తెచ్చుకొని కుటుంబమంతా విగ్రహాలు తయారు చేస్తామని తెలిపారు. తనకు ఇద్దరు కుమారుడు, ఒక కుమార్తె అని చిన్నగరటయ్య తెలిపారు.



తయారు చేసిన వినాయక విగ్రహాలు

పెద్ద కుమారుడు సురేష్, అతని భార్య గీత, చిన్న కుమారుడు నరేష్ అతని భార్య ప్రసన్న కూడా విగ్రహాల తయారీలో సాయం అందిస్తారని చెప్పారు. విగ్రహాలను చు ట్టుపక్కల గ్రామాలు నత్తారామేశ్వరం, మల్లి పూడి, తణుకు, అత్తిలి, నవుడూరు, మార్టేరు, వేల్పూరు, పెనుమంట్ర, ఆలమూరుతో పాటు పలు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, వ్యాపారులు కొనుగోలు చేసుకుంటారన్నారు.

# అంతర్జాతీయ పోటీల్లో తణుకు విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - తణుకు రూరల్**

అంతర్జాతీయ చిత్ర కళా పోటీల్లో తణుకు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించారు. ఇటీవల హైదరాబాద్ ఎంగ్ఎన్వాయిస్ ఇంటర్నేషనల్ వారు ఈ పోటీలు నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు ఉత్సవంలో భాగంగా నిర్వహించిన బాలల చిత్రకళా పోటీల్లో జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ నాయకులు, స్వాతంత్ర సమరయోధుల చిత్రాలు, స్వాతంత్ర సమర ఘట్టాలు చిత్రీంచారు. విద్యార్థులు బంగారు పతకాలు, జ్యూరీ హానర్ ప్రైస్‌లు పొందారని తెలిపారు. ఎస్.సోనియా, బి.పూజ్యలక్ష్మి, కె.మేఘనరాధ, పి.హేమంత్‌గణ, సిహెచ్.చరణ్, ఎస్-ఎల్.నరసింహ, బి.శ్రీహిత, కె.విద్యాహాసిని, జి.యశోధకృష్ణ, జెజె.అఖిల్ హనుమంత కుమార్, పి.శృతి, పి.రాంప్రసాద్, కె.తన్మయిప్రియ, ఎన్.ఖ్యాతిక, ఒ.కనకమహాలక్ష్మి, బి.నందిని బంగారు పతకాలు సాధించారని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు, చిత్రకళ ఉపాధ్యాయులుకు జ్ఞాన సుధా పురస్కార్ పేరుతో జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారని తెలిపారు. అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో విశేష ప్రతిభతో అవార్డులు సాధించిన విద్యార్థులను, చిత్రకళ ఉపాధ్యాయుడు డాక్టర్ వెంపటాపును ప్రధానోపాధ్యాయులు కె.పద్మావతి, జిజె.ప్రభువరం, కనకదుర్గేశ్వరి, శైలజ, వీరభద్రం, పెద్దిరాజు, అక్కింసెట్టి రాంబాబు, వెంకటరాజు, కోటయ్య, పాపారావు, రాధ, శీలా, సురేంద్ర అభినందించారు.




బంగారు పతకాలతో విద్యార్థులు

# రహదారుల అభివృద్ధికి కృషి

### పెన్నాడలో సీసీ రోడ్లు ప్రారంభించిన ఎంపిపి చంటిరాజు

**ప్రజాశక్తి - పాలకోడేరు**

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) అన్నారు. మండలంలోని పెన్నాడ గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం, పంచాయతీ, మండల పరిషత్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను సర్పంచి చిల్లా అనూష సత్యనారాయణతో కలిసి ఎంపిపి చంటిరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చంటిరాజు మాట్లాడుతూ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపేట వేస్తుందన్నారు. దీనిలో భాగంగా అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు, మండల పరిషత్ నిధుల ద్వారా అనేక రోడ్లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పెన్నాడ గ్రామంలో సకాలంలో రోడ్లను నిర్మించడం అభినందనీయమన్నారు. సర్పంచి అనూష సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు అవసరానికి తగ్గట్టుగా రహదారులను నిర్మించినట్లు చెప్పారు. గ్రామ అభివృద్ధికి డిసిసిబి ఛైర్మన్ పివిఎల్, ఎంపిపి చంటిరాజు అందిస్తున్న సహాయ సహకారాలు మర్చిపోలేమన్నారు. గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారుల సహకారంతో గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి కోరం వెంకటేశ్వర్లు, పార్టీ గ్రామ అధ్యక్షులు పాంద్రంగి శ్రీను, ఎంపిటిసి సభ్యులు ఆదాడ లక్ష్మీతులసి, ఆరేపల్లి పెదవెంకటస్వామి, నాయకులు గోపాలకృష్ణంరాజు, విశ్వనాథరాజు, కటిక శ్రీదేవి, నరేష్, దుండి అశోక్, గద్దం జోషి, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపిపి చంటిరాజు

# గణేష్ మట్టి విగ్రహాలు పంపిణీ

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, రసాయన రంగులు, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, మట్టితో చేసిన విగ్రహాలు వినియోగించాలని లయన్స్ క్లబ్ జోన్ ఛైర్‌పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు తెలిపారు. స్థానిక రామారావుపేటలో శ్రీబృందావనం వద్ద డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన పేరిచర్ల ఫౌండేషన్ సౌజన్యంతో వినాయక మట్టి ప్రతిమలు ఉచితంగా అందించారు. అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి ఈ ప్రాంతవాసులకు మట్టి విగ్రహాలు, మొక్కలు అందిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న పేరిచర్ల ఫౌండేషన్ సంస్థకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మునగాల జితేంద్ర, కుందుం వెంకటేశ్వరరావు, యెలిశెట్టి సత్యదేవ్, సుశీల, సత్యనారాయణరాజు, తాళ్ల సూరిబాబు పాల్గొన్నారు. వశిష్ఠ లియో క్లబ్ తరపున లయన్ వావిలాల సరళాదేవి సహకారంతో మట్టి విగ్రహాలు అందించారు. లియో మాధురి, సాయి శృతి, సంపత్ రెడ్డి, నందిని, ప్రజ్ఞ శిరీష పాల్గొన్నారు.

**పెనుమంట్ర :** మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడదామని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. మార్టేరులో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీ, ప్రదర్శన సుమారు వంద మంది విద్యార్థులతతో చేశారు. ముఖ్యఅతిథులు వీరవాసరం ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ ఎ.మనోహరరావు, జెడ్‌పిటిసి సభ్యులు గౌరీ సుభాషిణి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిపుణులుగా యోగా మాస్టర్ పడాల రామచంద్రారెడ్డి, డ్రాయింగ్ మాస్టర్ హర్షద్ వ్యవహరిం చారు. మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీల్లో ప్రథమ బహుమతి కాయల హర్షిని, రెండో బహుమతి మండా సాత్విక, మూడో బహుమతి బొక్క బాలభార్గవి గెలుపొం దారు. విద్యార్థులందరికీ ప్రోత్సాహక బహుమతులు అందిం చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ బాణాల శ్రీనివాసరావు, సెక్రటరీ బండి ప్రసాద్, ట్రెజరర్ మురళీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మండలంలోని పొలమూరు బాలల సంఘం సభ్యులు మట్టి వినాయకుల విగ్రహాలు తయారు చేశారు. జనవిజ్ఞాన వేదిక, ఐద్వా ఆధ్వర్యంలో పిల్లలు చేసిన వినాయ కుని విగ్రహాలతో వినాయక చవితి జరుపుకుని పర్యావ రణాన్ని కాపాడాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కేత పద్మజ, సిహెచ్.ఉదయకుమార్, సిహెచ్.భారతి, కేత ప్రమోద్, బి.విజయకుమార్ పాల్గొన్నారు.



పెనుమంట్ర : తయారుచేసిన వినాయకుని విగ్రహాలతో చిన్నారులు

**పాలకొల్లు :** వినాయక చవితి సందర్భంగా ఆదివారం ఉదయం పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్ వద్ద మట్టి వినాయక ప్రతిమ, వ్రతకల్ప పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. యునైటెడ్ కాపు క్లబ్ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పట్టణ సిఐ డి.రాంబాబు పాల్గొన్నారు. సంఘ అధ్యక్షులు గాది ఆంజనేయులు వంద ప్రతిమలు, ఇంటి ప్రసాద్ వంద ప్రతిమలు, జక్కంపూడి సుభాషిణి వంద ప్రతిమలు, కార్యదర్శి ఇనుకొండ శేషాద్రి వంద ప్రతిమలు బహూకరించారు. వ్రత కల్పము పుస్తకాలకు ఉనికెల శ్రీను, కొండ్రెడ్డి సూర్యనారాయణ రూ.రెండు వేలు చొప్పున, పశ్యావుల రవికుమార్ రూ.మూడు వేలు అందించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.

**ఉండి :** ప్రతిఒక్కరూ పరిరక్షణలో భాగస్వాములు అవ్వాలని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మెయిన్ సెంటర్‌లో ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా వినాయక ప్రతిమలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ రంగు రంగు విగ్రహాలు వాడటం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్‌కళ మాట్లాడుతూ ప్రతిఒక్కరు మట్టి విగ్రహాలనే వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు, బుద్దరాజు సుబ్బరాజు, రుద్రరాజు నరసరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, బొండాడ సూర్యబ్రహ్మానందం, వేగేశ్న మహేష్, కూనపరాజు రామసూరి, బొండాడ కేశవరావు, వి.సురేష్, సూర్య నారాయణరాజు, చంటి, శ్యామ్ పాల్గొన్నారు.

**వీరవాసరం :** వీరవాసరం యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. యునైటెడ్ కాపు క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల, సంజయ్ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాపు క్లబ్ ప్రెసిడెంట్ గుండా రామకృష్ణ, వనిత క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ బృందావన లక్ష్మీకల్యాణి, పోకల రాము, బృందావనం నాగేంద్ర, ఎర్రంశెట్టి సీనయ్య, మొఖమట్ల దుర్గాప్రసాద్, కుంచె వేణు నాగమణి, గుండా వెంకటరమణ, పాలకొల్లు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

**మొగల్తూరు :** పర్యావరణ పరిరక్షణకు తమ వంతులో భాగంగా మొగల్తూరులోని లక్ష్మీ హరిప్రియ గ్యాస్ ఏజెన్సీస్ ప్రొప్రైటర్ అనంతపల్లి గోపాలకృష్ణ మట్టి వినాయక ప్రతిమలు అందించారు. ప్రతిఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఉద్దేశంతో సుమారు 200 మందికి ప్రతిమలు, వినాయక వ్రత సంకల్ప పుస్తకాలను అందించామని గోపాలకృష్ణ తెలిపారు.

**గణపవరం :** మానవత సంస్థ గణపవరం మండల కమిటీ ఆధ్వర్యంలో వినాయక మట్టి రథములు ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కాకర్ల వినాయక మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి ప్రతిమలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు రామారావు, ఉపాధ్యక్షులు పుల్లయ్య, సాగిరాజు సుబ్బరాజు, బొడ్డు శ్రీనివాసరావు, పెరుమాళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

**ప్రజాశక్తి - పోడూరు**

అధిక విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సమావేశం మండల కార్యాలయంలో ముండే మోజేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ సర్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, అదనపు ఛార్జీలు, ఇంధన ఛార్జీలు అని రూ.15 వేల కోట్ల ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం భారాలు వేసిందన్నారు. టిడిపి హయాంలో నిర్మించుకున్న ఇళ్లకు రుణాలు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రుణాలు విడుదల చేయాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయని, స్లమ్స్‌ఏ రియాలో బ్లీచింగ్ చల్లాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బొంతు శ్రీను, బూరాబత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత వెంకటేశ్వరరావు మృతి

**ప్రజాశక్తి - వీరవాసరం**

మండలంలోని నవుడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత మైగాపుల వెంకటేశ్వరరావు (93) ఆదివారం వయోభారంతో మృతి చెందాడు. మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య అనుచరుల్లో ఒకరుగా వెంకటేశ్వరరావు గుర్తింపు పొందారు. నవుడూరు సెంటర్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించినటుల స్థానికులు తెలిపారు. ఆయనకు ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి స్థానిక నాయకులు కోడి అప్పారావు, నాగరాజు, శ్రీనివాసరాజు, యరకరాజు సుబ్రహ్మణ్యం, గొలగాని సత్యనారాయణ, స్థానిక వర్తక సంఘం తమ సంతాపం వ్యక్తం చేశారు.

## రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్‌రెడ్డి

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

మార్టేరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా గుడిమెట్ల లక్ష్మణ్‌రెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగించడానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కమిటీ కార్యదర్శిగా చింతా ధర్మ వీరనారాయణరెడ్డి, ట్రెజరర్‌గా బుట్టా రత్తయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఏడాది ఈ కమిటీ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి ముందుకు వెళ్తుందని అధ్యక్షులు లక్ష్మణ్‌రెడ్డి తెలిపారు. రోటరీ క్లబ్‌కి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేలా ప్రత్యేక కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

**మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**O.S. No. 94/2022**

1. శ్రీమతి యండపల్లి అరుణ -వాది

Vs

1. శ్రీ కుక్కల తిరుమల వెంకట శ్రీనివాస్ -ప్రతివాది

వాది పై నంబరు దావా బాకీ రాబట్టుకొనుటకు, ప్రతివాదిపై దాఖలు చేయటమైనది. ప్రతివాదికి పై నెంబరు దావాలో ఎన్ని పర్యాయములు కోర్టు వారి ద్వారా మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపుతున్నప్పటికి అందలి విషయములు తెలుసుకుని ఏదో కారణం చెప్పి కావాలని నోటీసులు తీసుకొనకుండా బుద్ధిపూర్వకముగా కాలయాపన చేయుచున్నారు. కనుక శ్రీ కోర్టు వారు ప్రతివాదిపై అమలు జరగవలసిన నోటీసులు పేపరు ప్రకటన ద్వారా తెలియచేయుటకు వాదికి అనుమతి జారీ చేసినారు. కనుక ప్రతివాది, పై నంబరు O.S. No. 94/2022 దావాలో వ్యక్తిగతంగా గాని, న్యాయవాది ద్వారా గాని **ది. 28-11-2023వ సంవత్సరం తేదీన ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై అభ్యంతరములు ఏమైనా ఉన్న ఎడల తెలియచేయవలెనని, లేని ఎడల ప్రతివాది పై పరోక్షముగా తదుపరి చర్యలు శ్రీ కోర్టు వారు జరిపించవలసి ఉండునని ఇందుమూలముగా ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

*By Order dt. 15-09-2023*

**నిమ్మగడ్డ పుల్లారావు**
న్యాయవాది, కొవ్వూరు

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSONS JUDGE :: WEST GODAVARI DISTRICT :: ELURU**
**I.A.No.1/2023 IN A.S.No. /2023**
**A.S.S.R.No.4982/2023**

***Between:***
Sri. Kusuma Chaitanya Mohan
***...Petitioner /Appellant***
***AND***
Mrs. Shamla Begum and two others
***...Respondents /Respondents***

**NOTICE**

***TO:***
***Respondent No.2:***
Mrs. Shaik Sufia Begum, W/o Late Ismail Sharief, Aged about 60 years Occ: Housewife, R/o 18-2-28, Gun Bazar, Eluru, West Godavari District, A.P.
***Respondent No.3:***
Mrs. Nageena Begum @ Nageera Sultana, W/o Gatti Ramesh, Aged about 33 years Occ: Housewife, R/o 18-3-28, Gun Bazar, Eluru, West Godavari District, A.P.

The above numbered petition is filed to condone the delay of 116 days in filing the Appeal A.S.No. /2023 (A.S.S.R.No. 4982/2023) against both of you and another. The appeal is filed against the decree and judgment dt: 21-10-2022 passed in O.S.No.315/2012 by the Hon'ble Principal Senior Civil Judge, Eluru. As both of you are evaded receiving the notice, the Hon'ble Court has passed order to issue notice through paper publication. The petition stands posted to 05-10-2023. **Both of you have to attend on 05-10-2023 at 10:30 A.M. in the above mentioned Court.** Else, the Hon'ble Court will pass orders in your absence.

***(By The Order Of The Court)***
Eluru, **S.SARVESWARA RAO**
17-9-23. Advocate, Eluru.